క్లుప్తంగా

వైభవంగా ఆంజనేయస్వామి తీర్థం

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి గ్రామంలో అభయాంజనేయస్వామి తీర్థమహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి నిమ్మకాయలు, బంతిపూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఉత్సవాల సందర్భంగా గ్రామ సర్పంచ్ మదినా లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు మదినా అప్పలరమణ, మదినా ప్రకాష్ ఆధ్వర్యంలో పలు సంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జబర్దస్త్ కళాకారుల ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. అలాగే మంగళపాలెం గ్రామంలో గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో వీరాంజనేయస్వామి తీర్థం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారిని కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయం వద్ద భక్తులు భజన కార్యక్రమం నిర్వహించారు.

ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ

మెరకముడిదాం: మెరకముడిదాం, సోమలింగాపురం, ముడిదాంపాలెం గ్రామాలకు చెందిన గ్రామదేవత మెరకతల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులకు రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ సభ్యుడు కేఎస్ఆర్ ప్రసాద్, మెరకముడిదాం పీఏసీఎస్ అధ్యక్షుడు కె.గుర్రాజు శుక్రవారం భూమిపూజ చేశారు. ఎం.పాలెం గ్రామ సమీపంలో ఉన్న ఈ ఆలయ అభివృద్ధికి పలువురు దాతలు ముందుకువచ్చి సుమారు రూ.4 లక్షల వరకు అందించారు. ఆ నిధులతో ఆలయం ఆవరణలో టైల్స్, భక్తులు మొక్కులు తీర్చే ప్రదేశంలో ఉన్న రచ్చబండపై రేకులషెడ్ ఏర్పాటు, నాగదేవత పుట్ట చుట్టూ భక్తులు ప్రదక్షిణ చేసేందుకు వీలుగా రేకులషెడ్‌ను నిర్మించనున్నారు.

బూత్ కమిటీలు ఏర్పాటు చేసుకోవాలి

చీపురుపల్లి: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతీ పోలింగ్ బూత్‌కు నలుగురు సభ్యులతో కూడిన కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం చెప్పారు. పట్టణంలోని లావేరు రోడ్‌లో ఉన్న పార్టీ కార్యాలయంలో మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచ్‌లు, ముఖ్య నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. రానున్న అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో పోలింగ్ బూత్ కమిటీలు కీలకపాత్ర పోషించనున్నాయని చెప్పారు. ఓటర్ల జాబితాలను పరిశీలించి, తప్పులు ఏమైనా ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్దనరావు, జేసీఎస్ మండల కన్వీనర్ సువ్వాడ అప్పలనాయుడు, సోషల్ మీడియా కోకన్వీనర్ ఎల్.ప్రభాత్ తదితరులు ఉన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

గంట్యాడ: పీహెచ్‌సీకి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు సూచించారు. గంట్యాడ పీహెచ్‌సీని శుక్రవారం ఆయన ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ, ఐపీ, మందుల నిల్వలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. 24 గంటల పాటు పీహెచ్‌సీలో అందుబాటులో ఉండాలని, రోగులకు మెరుగైన సేవలందించాలని, ప్రసవాల సంఖ్యను పెంచాలని సిబ్బందికి సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. రోగులు వచ్చినప్పుడు వైద్య సిబ్బంది అందుబాటులో లేరనే ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వేపాడ: మండలంలో బక్కునాయుడుపేట ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఐదోతరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఐదో తరగతిలో 80 సీట్లు, ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్‌లో ఎంపీసీలో 40 సీట్లు, బైపీసీ 40 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 23వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మార్చి 10న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8985883015లో సంప్రదించాలని కోరారు.

సామాజిక తనిఖీలపై గ్రామసభ

వేపాడ: మండలంలో శింగరాయి పంచాయతీలో నిర్వహించిన ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీలపై డీఆర్పీ డి.జగదీష్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్పీ మాట్లాడుతూ.. 2022–23 ఆర్థిక సంవత్సరంలో పంచాయతీలో ఉపాధిహామీ పథకం కింద 34 పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇందుకు గాను వేతనదారులకు రూ.44,34,092లు, మెటీరియల్ కాంపొనెంట్ కోసం రూ.4,66,049లు, గ్రామ సచివాలయం భవనం నిర్మాణం కోసం రూ.20,55,796లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. సామాజిక తనిఖీల్లో గుర్తించిన అంశాలను చదివి వినిపించారు. కార్యక్రమంలో సర్పంచ్ నిరుజోగి వెంకటరావు, ఎంపీటీసీ రాంజీ, గ్రామపెద్దలు, వేతనదారులు పాల్గొన్నారు. అలాగే రామస్వామిపేట, ముకుందపురం పంచాయతీల్లో సామాజిక తనిఖీలపై గ్రామసభలు నిర్వహించారు.

ఆదిత్యునికి ప్రత్యేక పూజలు

మెరకముడిదాం: రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని సోమలింగాపురంలో వెలసిన శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఆరవెల్లి కృష్ణశాస్త్రి, వేదపండితులు స్వామివారికి సుప్రభాత సేవ, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్.వి.రమణరాజు, ఆయన సోదరులు, కుటుంబ సభ్యులు స్వామికి క్షీరాభిషేకం చేసి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం స్వామివారి దర్శనానికి భక్తులను అనుమతించారు. పరిసర గ్రామాలకు చెందిన మహిళలు ఆలయ ప్రాంగణంలో పాలతో పాయసం చేసి స్వామివారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



మెరకముడిదాం: సోమలింగాపురంలో సూర్యనారాయణ స్వామికి క్షీరాభిషేకం చేస్తున్న ఆలయ అర్చకులు



బొండపల్లి: రాజరాజేశ్వరి అమ్మవారి విగ్రహాన్ని తాకిన సూర్యకిరణాలు



చీపురుపల్లి రూరల్: గరివిడి గర్భాం రోడ్డులో ఉన్న సూర్యసదనంలో రథసప్తమి పూజలందుకుంటున్న సూర్యనారాయణ స్వామి

• జామి: మండలంలోని పుష్పగిరి వేణుగోపాలస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఫణిహారం సీతారామాచార్యులు ఆధ్వర్యంలో సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులు పాలు పొంగించారు. భీమసింగి వేంకటేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమి సందర్భంగా అర్చకులు ఆదిత్య హృదయపారాయణం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

• కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గేటు సమీపంలో ఉన్న ఓం సదరం ఆశ్రమం, విశాఖపట్నం రోడ్డులో ఉన్న సూర్యనారాయణస్వామి ఆలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఓం సదరం ఆశ్రమంలో బ్రహ్మశ్రీ అంపోలో ఉమామహేశ్వరశర్మ ఆధ్వర్యంలో సౌర శాంతి యజ్ఞం నిర్వహించారు. భక్తులు సూర్య భగవానుడిని దర్శించుకొని ప్రత్యేక పూజల చేశారు.



జామి: పుష్పగిరిలో స్వామివారికి పల్లకిసేవ చేస్తున్న భక్తులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): రథసప్తమిని పురస్కరించుకుని గరివిడి పట్టణంలో గర్భాం రోడ్డులో ఉన్న సూర్యసదనం శ్రీవిద్య సౌరశక్తిపీఠంలో పీఠాధిపతి వేముకోటి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకాలు, 108 కలశాలతో అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి 1100 బంగారు పుష్పాలు, వెండి పుష్పాలతో సహస్ర నామార్చన నిర్వహించారు. సూర్య భగవానుడ్ని ఆరాధించడం వల్ల శారీరక, మానసిక రుగ్మతలు తొలగి జీవితం ఆనందకరంగా మారుతుందని భక్తుల విశ్వాసం.

అమ్మవారిని తాకిన సూర్యకిరణాలు

బొండపల్లి: రథసప్తమి సందర్భంగా మండలంలోని దేవుపల్లి గ్రామంలో వెలసిన రాజరాజేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యుడి కిరణాలు అమ్మవారి విగ్రహాన్ని స్పృశించాయి. ఆ దృశ్యాన్ని చూసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ అర్చకుడు దూసి శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు చేశారు. రథసప్తమిని పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం



గంట్యాడ: గొడియాడలో ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు



బొండపల్లి: గరుడుబిల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 శిబిరంలో రోగులకు మందుల కిట్లు అందజేస్తున్న ఎంపీపీ చలంనాయుడు, వైద్య సిబ్బంది



దత్తిరాజేరు: వంగరలో ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు,జడ్పీటీసీ రాతు రాజేశ్వరి



లక్కవరపుకోట: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మందులను పరిశీలిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు

బొండపల్లి: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా నిపుణులైన వైద్యులు గ్రామస్థాయిలోనే మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. బొండపల్లి మండలం గరుడుబిల్లి, దత్తిరాజేరు మండలం వంగర, లక్కవరపుకోట మండలం కొట్యాడ, గరివిడి మండలం అర్తమూరు గ్రామంలో శుక్రవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాలను నిర్వహించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు వైద్య శిబిరాలను సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలను పర్యవేక్షించారు. రోగులకు వైద్య సిబ్బంది పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. గంట్యాడ మండల గొడియాడలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరాన్ని డీఎంహెచ్ఓ భాస్కరరావు పర్యవేక్షించారు.

గరిష్ట వేతనం అందేలా చర్యలు

బొండపల్లి: ఉపాధి పనులకు హాజరయ్యే ప్రతీ వేతనదారుడికి గరిష్ట వేతనం అందేలా పనులు కల్పించాలని ఎంపీడీఓ ఎస్.హరిహరరావు ఉపాధి క్షేత్రసహాయకులకు సూచించారు. మండలంలోని కిండాం అగ్రహారం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. పనులకు హాజరైన వేతనదారుల సంఖ్య, నమోదు చేసిన మస్టర్లను సరిచూశారు. పని ప్రదేశంలో తాగునీరు, నీడ సౌకర్యాలు ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు.

డీసీసీబీ బ్రాంచ్ ప్రారంభం

దత్తిరాజేరు: మారుమూల గ్రామాలకు బ్యాంక్ సేవలు అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకటచినరామునాయుడు అన్నారు. మండల కేంద్రమైన దత్తిరాజేరులో డీసీసీబీ నూతన బ్రాంచ్‌ను శుక్రవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ కోఆపరేటివ్ బ్యాంక్ అనేది రైతులకు గొర్రెలు, మేకలు, పంట రుణాలు మాత్రమే ఇచ్చేందుకు కాదని, జాతీయ బ్యాంక్‌లు అందిస్తున్న అన్ని సేవలను కోఆపరేటివ్ బ్యాంకు ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు, జడ్పీటీసీ రాతు రాజేశ్వరి, పీఏసీఎస్ అధ్యక్షుడు సుమల శ్రీను, ఏఎంసీ వైస్ చైర్మన్ మండల శ్రీను, డీసీసీబీ అధికారులు పాల్గొన్నారు.

శ్మశానంలో బోరు ఏర్పాటు

గుర్ల: మండలంలోని రాగోలులో శ్మశనవాటికలో చేతిపంపు బోరు ఏర్పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పాట్నూరు సన్యాసినాయుడు శుక్రవారం శంకుస్థాపన చేశారు. శ్మశనవాటికలో బోరు లేకపోవడంతో అంత్యక్రియల సమయంలో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల ఇబ్బందులు దృష్ట్యా మండల పరిషత్ నిధులతో బోరు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ చందక బంగారునాయుడు, ఎంపీటీసీ గిడిజాల రామకృష్ణ పాల్గొన్నారు.

ట్రై సైకిల్ అందజేత



బ్యాటరీ ట్రై సైకిల్‌ను అందజేస్తున్న బెల్లాన వంశీకృష్ణ

చీపురుపల్లి: దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలను ప్రభుత్వం అందిస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ అన్నారు. స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రెడ్డిపేట గ్రామానికి చెందిన రెడ్డి సత్యనారాయణ అనే దివ్యాంగునికి ఎలక్ట్రిక్ ట్రై సైకిల్‌ను అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గిరడ రాందాసు, కరణం ఆది, కింతలి మధు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'గ్రామ సందర్శన'



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట: గ్రామ సందర్శన కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శుక్రవారం సాయంత్రం మండలంలోని సీతంపేట గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే అక్కడి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. పాఠశాలలో వసతులు, భోజనాలు ఎలా ఉన్నాయని ఆరా తీశారు. అనతరం గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే.. 19వ వార్డు యాతవీధిలో ఏర్పాటు చేసిన సామాజిక భవనాన్ని స్థానిక వార్డు సభ్యులతో కలిసి ప్రారంభించారు. అనంతరం రామాలయం వద్ద పార్టీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో రూ.25 లక్షలతో సీసీ డ్రైన్లు, రూ.40 లక్షలతో పాఠశాల భవనాలు, రూ.3 లక్షలతో కమ్యూనిటీ హాల్, రూ.2 లక్షలతో శివాలయం రోడ్డులో కల్వర్టు, రూ.2 లక్షలతో బంగారమ్మ ఆలయానికి సీసీరోడ్డు వేశామన్నారు. 58 నెలల వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతీ ఇంటికి పథకాలు అందించామన్నారు. ఎన్నికలు సమీపించడంతో మాయమాటలతో ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు, అండ్ కో వస్తున్నారని, వారి మాయమాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్టేట్ ఫోక్ అకాడమీ డైరెక్టర్ వి.రాంబాబు, వైస్ ఎంపీపీ పి.వెంకటరమణ, వార్డు సభ్యులు చింతల సత్యవతి, వేమలి సావిత్రి, ఎంపీటీసీ ఎస్.నాగలక్ష్మి, జేసీఎస్ ఇన్‌చార్జ్ వి.సతీష్, మమ్ములూరి సోంబాబు, చింతల సత్యనారాయణమూర్తి, బుగత వెంకటేశ్వరరావు, పి.జగదీష్, డి.పార్వతి, కె.జయశంకర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు వలంటీర్లకు సత్కారం

జామి: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు సేవా పురస్కారాలకు ఎంపికైన వలంటీర్లను సన్మానించనున్నట్లు ఎంపీడీఓ తిరుమలరావు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేలు కడుబండి శ్రీనివాసరావు, బొత్స అప్పలనరసయ్య హాజరవుతారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

టీడీపీని నమ్మే స్థితిలో ప్రజలు లేరు

• ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

దత్తిరాజేరు: అవినీతిలో కూరుకుపోయిన టీడీపీని నమ్మే స్థితిలో ప్రజలు లేరని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అన్నారు. పోరలి గ్రామంలో రూ.42 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.21 లక్షలతో నిర్మించిన హెల్త్ వెల్‌నెస్ సెంటర్, రూ.21.8 లక్షలతో నిర్మించిన ఆర్బీకే భవనాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మిత్తిరెడ్డి రమేష్ అధ్యక్షతన నిర్వహించిన సభలో గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థ, గ్రామ వలంటీర్ వ్యవస్థలతో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రతీ కుటుంబానికి లబ్ధి చేకూర్చాలన్నదే ప్రభుత్వ ధ్యేయంగా పేర్కొన్నారు. ఇదే రీతిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందాలంటే రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మిత్తిరెడ్డి ధనలక్ష్మి, సిరిపురపు రమణమ్మ, సాలాపు లక్ష్మి, ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు, జడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీ బమ్మిడి అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణమూర్తి, జేసీఎస్ కన్వీనర్ ఫణీంద్రుడు, స్థానిక నాయకులు సిరిపురపు శంకరరావు, పారారావు, నారాయణప్పుడు పాల్గొన్నారు.



పోరలిలో గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, తదితరులు

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా..?



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

• టీడీపీ నాయకులు మతి భ్రమించి మాట్లాడుతున్నారు
• ముఖ్యమంత్రిని, మంత్రులను విమర్శించే స్థాయి లోకేష్‌కు లేదు
• వైఎస్సార్‌సీపీ మండల నాయకులు

చీపురుపల్లి: విదేశాల్లో చదువుకుని వచ్చిన నారా లోకేష్, కిమిడి నాగార్జున కనీసం సంస్కారం లేకుండా అబద్ధాలు ఎలా మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని, జిల్లాలో, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి వారి కళ్లకు కనిపించడం లేదా అని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి అనంతం, జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ ప్రశ్నించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. లోకేష్ శంఖారావం సభకు జనం లేకపోవడంతో వారు ఖంగుతిన్నారని, ఏం మాట్లాడుతున్నారో వారికే తెలియడం లేదన్నారు. అభివృద్ధి కోసం మాట్లాడుతున్న వారు చీపురుపల్లి, కుప్పం నియోజకవర్గాల్లో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గంలో కనీసం తాగునీటి సౌకర్యం కూడా కల్పించలేకపోయారని ఎద్దేవా చేశారు. కుప్పాన్ని రెవెన్యూ డివిజన్‌గా చేయాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి చంద్రబాబు నాయుడు దరఖాస్తు చేసుకున్నాడని గుర్తుచేశారు. కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు హయాంలో జిల్లాకు ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. టీడీపీ హయాంలో దోచుకోవడం తప్ప ఇంకేం జరగలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆశీస్సులతో రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ చొరవతో జిల్లా, నియోజకవర్గం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కళాశాల, గిరిజన యూనివర్సిటీ, భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు, చీపురుపల్లి నియోజకవర్గంలో ఇంటింటికి తాగునీటి కుళాయిలు, ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నికల్ కళాశాలు, వంద పడకల ఆస్పత్రి, రహదారులు, తోటపల్లి కాలువ వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టినవేనని అన్నారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ చొరవతో పట్టణంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.13 కోట్లు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయని, ప్రస్తుతం పనులు పూర్తికావచ్చాయని అన్నారు. ఆ పక్క నుంచే వచ్చిన లోకేష్‌కు బ్రిడ్జి పనులు కనిపించలేదా అని ప్రశ్నించారు. సీఎం జగన్, మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లను విమర్శించే స్థాయి లోకేష్‌కు లేదన్నారు. వారితో పాటు పార్టీ నాయకులు దన్నాన జనార్దనరావు, బెల్లాన త్రినాథరావు, బాణాన శ్రీనివాసరావు, మీసాల రమణ, రఘుమండ త్రినాథ్, అధికార్ల శ్రీనుబాబు, పనస అప్పారావు, తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత

• ఎంపీపీ పీరుబండి హైమావతి



గంట్యాడ: మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి



మెరకముడిదాం: గర్భాంలో బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

గంట్యాడ: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ పీరుబండి హైమావతి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనపై వీఆర్వోలు, ఎంఎస్‌కేలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి బాల్య వివాహాలను అడ్డుకోవాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే 1098కు గానీ, స్థానిక పోలీసులకు గానీ సమాచారం అందివ్వాలని ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించేవారిపై, వివాహానికి హాజరైన పురోహితులు, లైటింగ్, షామియానా నిర్వాహకులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఎంపీడీఓ వై.భవాని, తహసీల్దార్ పి.నీలకంటేశ్వరరెడ్డి, సీడీపీఓ ఉమాభారతి, డీసీపీయూ ప్రతినిధి రామకోటి, తదితరులు పాల్గొన్నారు.

• మెరకముడిదాం: మండలంలోని గర్భాం రామమందిరం వద్ద శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తూ కళాజాతా నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, పౌష్టికాహారం ప్రాధాన్యతను కళాకారుల బృందం బుర్రకథ రూపంలో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తాడ్డి శ్రీదేవి, జె.లక్ష్మి, ఎం.నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శంఖారావానికి ఆదరణ కరువు

గంట్యాడ: టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శుక్రవారం సాయంత్రం గంట్యాడలో నిర్వహించిన శంఖారావం సభకు ప్రజల నుంచి ఆదరణ కరువైంది. ప్రతీ సభలో ప్రస్తావించిన అంశాలనే ఇక్కడ కూడా ప్రస్తావించడంతో సభకు వచ్చిన కొద్ది మంది కూడా లోకేష్ ప్రసంగం మధ్యలోనే వెనుదిరిగారు. దీంతో సభాప్రాంగణంలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి.

వేడుకగా ఫేర్‌వెల్ డే

వేపాడ: మండలంలో బక్కునాయుడుపేట ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్ సెకండ్ ఇయర్స్ విద్యార్థులకు వీడ్కోలు పలికారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. వార్షిక పరీక్షలకు ప్రణాళికతో సన్నద్ధం కావాలని, పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాల సూచించారు. అనంతరం విద్యార్థినులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు.

పైడితల్లమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే



పైడితల్లమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు

గజపతినగరం: స్థానిక దిగువవీధిలో వెలసిన పైడితల్లమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కందుల చిన్నయ్యస్వామి ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఏఎంసీ చైర్మన్ మేమలి ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, పార్టీ నాయకులు మండల సురేష్, బెల్లాన త్రినాథరావు, తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నసమారాధనలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.